క్లుప్తంగా

నిధుల మంజూరు అభినందనీయం

పామర్రు: మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పామర్రు సెంటర్‌లోని అంబేడ్కర్ భవనానికి రూ.30 లక్షల నిధులుమంజూరు చేయటం అభినందనీయమని అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. స్థానిక కూడలి వద్ద వారు మాట్లాడుతూ ఎంపీ నిధులు మంజూరు చేయించి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదార్లు, వంతెనలు నిర్మిస్తూ ప్రతి గ్రామంలో తనదైన అభివృద్ధి మార్కు చూపిస్తూ నిరంతరం నియోజకవర్గపు అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్‌కు వారు కృతజ్ఞలు తెలిపారు.

నేడు నిరసన ర్యాలీ

పామర్రు: టీడీపీ అధినేత చంద్రబాబు పేదల ఇల్ల స్థలాలను శ్మశాన వాటికలతో పోల్చి పేదలకు దారుణంగా అవమానించినందుకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యలలో సోమవారం సాయంత్రం 3 గంటలకు పామర్రు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి కురుమద్దాలి గ్రామం వరకు నిరసనగా బైక్ ర్యాలీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పామర్రు శాసన సభ్యులు కై లే అనిల్‌కుమార్ ర్యాలీలో పాల్గొంటారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

కొండలమ్మకు మొక్కుబడుల సమర్పణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన గంగానమ్మ సంబరాలు



గుడ్లవల్లేరు: వడ్లమన్నాడులో 27 ఏళ్లకు ఒకసారి జరిగే గంగానమ్మ సంబరాలను గ్రామస్తులు నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి మొక్కుబడులను చెల్లించే కార్యక్రమంతో ఈ సంబరాలు ముగిశాయి. అమ్మవారిని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెన్నేరు ప్రభాకర్, శేషం గోపి, దిలీప్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి మల్లెలతో అర్చన




మండవల్లి: మండలంలోని లోకుమూడి దత్తాశ్రమంలో లక్ష మల్లెలార్చన భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ 81వ జన్మదిన ఉత్సవాల్లో భాగంగా ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ్ శంకర్ శ్రీ అనసూయదేవి దత్తాత్రేయ స్వామికి మల్లెల అర్చన కార్యక్రమం కన్నులపండువగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అన్న ప్రసాద వినియోగం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్తికేయుని సన్నిధిలో విజయవాడ సీపీ టీకే రాణా

మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని విజయవాడ పోలీస్ కమిషనర్ టీకే రాణా, విజయవాడ ఐజీ సునీల్‌కుమార్ నాయక్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షణ చేసి నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు బుద్దు పవన్ కుమార్ శర్మ, ఆలయ అర్చకులు మూర్తి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డుప్రసాదాలు అందజేశారు. చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వలంటీర్లు మెరుగైన సేవలు అందించాలి

ఎమ్మెల్యే డీఎన్నార్



వలంటీర్లకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: వలంటీర్లకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం అందిపుచ్చుకుని మెరుగైన సేవల ద్వారా ప్రభుత్వానికి పేరు తెచ్చేలా పనిచేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మార్కెట్ యార్డులో వలంటీర్లకు వందనం సన్మాన పురస్కార కార్యక్రమంలో డీఎన్నార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వలంటీర్లను సన్మానించి, పురస్కారాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ల శ్రమను, సేవలను గుర్తించి మూడు సంవత్సరాలుగా సన్మాన, పురస్కారాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వానికి సహకరించాలన్నారు. మండలంలో 16 గ్రామ సచివాలయాల్లో వలంటీర్లుగా పనిచేస్తున్న వారికి సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర పరుస్కారాలు అందజేశారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, సర్పంచ్ మెండా ఝాన్సి, వైస్ ఎంపీపీ అగస్తి ఆదివిష్ణు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబు రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బొమ్మన బోయిన గోకర్ణయాదవ్, దాసరి ప్రసాద్, నాయకులు ముంగర మల్లిఖార్జునరావు, బొబ్బొలి రత్తయ్య నాయుడు, జయమంగళ వీర్రాజు, మెండా సురేష్, జి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు పొందిన వలంటీర్లతో అధికారులు, ప్రజాప్రతినిధులు

వలంటీర్ల సేవలు అభినందనీయం

గుడివాడ టౌన్: ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో వార్డు వలంటీర్ల సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక గుడ్‌మెన్ పేట బీసీ హాస్టల్‌లో పట్టణానికి చెందిన 12, 13, 14, 15, 16, 17, 18 వార్డుల వలంటీర్లకు సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రారంభించి అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులను గుర్తించి అందించడంలో వీరి పాత్ర ఎంతో గొప్పదన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించి ప్రభుత్వం సత్కరిస్తుందని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి, నాయకులు కృష్ణమోహన్, దారం ఏడుకొండలు పాల్గొన్నారు.

గంగానమ్మ తల్లి ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తి



గంగానమ్మ తల్లి నూతన ఆలయం

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు గ్రామంలో గంగానమ్మ తల్లి ఆలయ జీర్ణోద్ధరణ పనులు శరవేగంగా పూర్తి చేశారు. గ్రామంలో ఆలయం నిర్మించి వంద సంవత్సరాలు పూర్తి కావటంతో గ్రామస్తులు అందరూ కలిసి ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేయటానికి ముందుకు వచ్చారు. గ్రామంలో కమిటీగా ఏర్పాటై విరాళాలు సేకరించారు. సుమారు రూ.80 లక్షల విరాళాలు వచ్చాయని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రవాసాంధ్రులు కూడా విరాళాలు అందించారు. కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఆలయంలో మినీ ఫంక్షన్ హాల్, పొంగళ్ల షెడ్డు, యాజ్ఞయాగాదుల నిర్వహణకు నిర్మాణాలు చేపట్టారు.

1 నుంచి ప్రతిష్ఠోత్సవాలు..

ఆలయ జీరోద్ధరణ ప్రతిష్టాత్సవాలు వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నయని కమిటీ సభ్యులు తెలిపారు. తొలి రోజున పుణ్యాహవచనం, ఆఖండ స్థాపన తదితర కార్యక్రమాలు, 2న వాస్తు హోమం, జలాధి, క్షీరాధివాసం, 3న అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన ఉంటుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం అదే రోజు భారీ అన్నసమారధన ఉంటుందని తెలిపారు.

సేవలను మరింత విస్తృతం చేస్తాం



మాట్లాడుతున్న మానవత సేవా సంస్థ కార్యదర్శి బాలుడు

పామర్రు: మానవత సేవాసంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృత పరుస్తామని మానవత పామర్రు శాఖ కార్యదర్శి ఆరిగెల బాలుడు అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత ద్వారా ఉచితంగా ఫ్రీజర్‌బాక్స్‌ను అందుబాటులో ఉంచామన్నారు. వేసవిలో విద్యార్థులకు ఉచితంగా కెరీర్ గైడెన్సు పుస్తకాలు అందజేశామన్నారు. ఉపాధ్యక్షులు దాసరి వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీఎంఎస్ ప్రసాద్, శీతాల ప్రసాద్, సుచిత్ర నాగశ్వేత, వైఎస్ఎస్ ప్రసాద్, జీరంగారావు, కె. శ్రీనివాసరావు, డి.సుబ్రమణ్యేశ్వరరావు, ఎం.సుబ్బారావు, ఎస్ అజయ్‌బాబు, పీరమేష్, అవినాష్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో సంఘాలు



మజ్జిగ పంపిణీ చేస్తున్న వెలమ సంక్షేమ సంఘం సభ్యులు

గుడివాడ టౌన్: పట్టణంలో వేసవి తాపం అధికంగా ఉండటంతో పలు సామాజిక సేవా సంఘాలు, అసోసియేషన్‌లు ఆదివారం భారీగా మజ్జిగ పంపిణీలు చేశారు. స్థానిక మెయిన్ రోడ్‌లో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి తాపం తగ్గేవరకు కార్యక్రమం కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.రంగారావు, ఎంవీ సత్యన్నారాయణ, గుళ్లిపల్లి ప్రభాకరరావు, మూడెడ్ల ఉమ, రమీజా, రెడ్డి సింహాచలం, వంగపండు బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం గుడివాడ సబ్ డివిజన్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస సెంటర్‌లో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు భవిరి శంకరనాథ్, కార్యదర్శి వీవీ మురళీకృష్ణ, కోశాధికారి బొమ్మదేవర సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద ఎరికపాడు మలుపు వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ డిప్యూటీ గవర్నర్ దాసరి సుధాకర్ సౌజన్యంతో ఈ పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎంసీహెచ్ నారాయణరెడ్డి, కోశాధికారి లక్ష్మీ నారాయణరెడ్డి, అంగలూరు కెనరా బ్యాంక్ మేనేజర్ విజయకుమార్, ఎంవీ శేఖర్, చిన్నం గంగాధర్, కె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి

ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కొడాలి నాని నివాళి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఆయన విగ్రహానికి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు కొత్త అర్థం చెబుతూ పరిపాలనలో అనేక విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. గుడివాడ తాలూకా నిమ్మకూరులో జన్మించిన ఆ మహనీయునికి నేటికి నూరేళ్ల పూర్తికావడం ఎంతో సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో తాను పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణలతో సినీ రంగంలో తిరుగులేని స్థానం సాధించిన ఆయన అదే స్ఫూర్తితో రాజకీయాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారన్నారు. ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి శివసుబ్రహ్మణ్యం (చంటి), సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, స్టేడియం కమిటీ సభ్యులు బొగ్గారపు తిరుపతయ్య, నెరుసు శేషగిరిరావు, పిన్నమనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శత సినీ గానామృతం ..

ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ఘంటసాల స్మారక సంగీత కళాపీఠం గుడివాడ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నటించిన వంద చిత్రాల పాటల కచేరీ స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన సినీ గాయకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. వంద ఎన్టీఆర్ పాటలు పాడి ఆయన అభిమానులను అలరింప చేశారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి శ్రీనివాసరావు, కంచనపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరులో..

నిమ్మకూరు(పామర్రు): మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్వగ్రామం నిమ్మకూరులో ఆయన శత జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలకు అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పామర్రులోని నాలుగురోడ్ల కూడలి వద్ద ఎన్టీఆర్‌చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

తుంగపల్లెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మాచవరం తుంగపల్లెమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రవచనాల నడుమ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన భక్తిప్రపత్తులతో జరిపారు. అవనిగడ్డ, కోడూరు, వి.కొత్తపాలెం గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కుబడులు సమర్పించి, ఆలయం వద్దే సహపంక్తి భోజనాలు నిర్వహించారు. తలపై గండుదీపాలతో మొక్కులు సమర్పించారు. అమ్మవారి మూలమూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది.

విజేతలకు బహుమతుల పంపిణీ



గూడూరు: వేసవి సెలవులను పురస్కరించుకుని గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గూడూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ గొరిపర్తి వరలక్ష్మి ఆదివారం బహుమతులను అందజేశారు. గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారం రోజులుగా శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు.

మృతుని కుటుంబానికి సాయం



కోనేరుసెంటర్: కానూరు పీఏసీఎస్ సభ్యుడు జొన్నల వీరరాఘవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సొసైటీ తరపున మట్టి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ. 10 వేలను సొసైటీ అధ్యక్షుడు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు ఆదివారం మృతుని భార్య లలితాంబకు అందజేశారు. కానూరు ఉప సర్పంచ్ గోపు మురళి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గణపాబత్తుల చూడామణిరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి



జమీగొల్వేపల్లిలో పఠన కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు



పామర్రులో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

పామర్రు: విద్యార్థులు సామూహిక పఠన కార్యక్రమంలో పాల్గొంటే ఎంతో మేలు కలుగుతుందని గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ అన్నారు. మండల పరిధిలోని జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా ఆదివారం సామూహిక గ్రంథ పఠనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలన్నారు. రోజూ దిన పత్రికలు చదవాలని, వ్యాపార, రాజకీయ, ఆర్థిక, అంతర్జాతీయ వార్తలు, క్రీడలు, వినోదానికి సంబంధించినవి, విద్యతో కూడిన సమగ్ర కథనాల స్రవంతి దిన పత్రికలను చదవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు పంచతంత్ర, నీతికథలు, దిన పత్రికలను చదివించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో పలు ఆటలను ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్విజ్, జనరల్ నాలెడ్జిపై అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్ పర్వీన

మండవల్లి: మండవల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి షేక్‌పర్వీన క్విజ్, పొడుపు కథలు, జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. షేక్ పర్వీన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన గనులని తెలిపారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో పయనించాలని కోరారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి



జగనన్న గ్రీన్ విలేజ్‌లో నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: జగనన్న గ్రీన్ విలేజ్‌లో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. నిర్మాణాల పనితీరును ఆయన ఆదివారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 3000 మంది లబ్ధిదారులకు గ్రీన్ విలేజ్ పట్టాలు అందించామన్నారు. శ్లాబ్ దశకు చేరిన లబ్ధిదారులకు కేడీసీసీ బ్యాంకు ద్వారా రూ.2 లక్షలు రుణంగా అందిస్తున్నామన్నారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు లబ్ధిదారుల్లో అవగాహన కలిగించాలని సూచించారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



కలిదిండి జెడ్పీ ఉన్నత పాఠశాల 1988-89 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

కైకలూరు(కలిదిండి): పూర్వ విద్యార్థులు 34 సంవత్సరాలు తర్వాత చదువుకున్న బడిలోనే తిరిగి ఆదివారం కలుసుకున్నారు. అప్పటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఈ ఘట్టానికి కలిదిండి జెడ్పీ హైస్కూల్ వేదికై ంది. అందరూ కలిసి సరదాగా గడిపారు. 1988–89 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, ఇతర వృత్తుల్లో స్థిరపడ్డారు. యూనివర్సిటీ ప్రొఫెసరు, ఎలక్ట్రికల్ డీఈ, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇలా పలు ఉద్యోగాలు చేస్తున్నవారు కలుసుకుని అనాటి సంగతుల్ని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో చదువులు చెప్పిన ఉపాధ్యాయులు పూర్ణచంద్రరావు, కోటా శర్మ, పి.వెంకటేశ్వరరావు, రైటర్ ప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు.

వడదెబ్బకు యాచకుడి మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వడదెబ్బకు యాచకుడు మృతి చెందిన ఘటనపై గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... గవర్నర్‌పేట ఎన్టీఆర్ కాంప్లెక్స్ ఏరియాలో రవి అనే యాచకుడు భిక్షాటన చేస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఎన్టీఆర్ కాంప్లెక్స్ సమీపంలో వడ దెబ్బ తగిలిపడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా అతనని గవర్నమెంట్ హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి 10 గంటల సమయంలో చనిపోయాడు. రవి సమాచారం తెలిసిన వారు నేరుగా సంప్రదించాలని సీఐ సురేష్ కోరారు.

అంకమ్మతల్లి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి కుంకుమ, శ్రీచక్రార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఒరిజనల్ దస్తావేజులు, పాస్‌బుక్ పోయినవి

కృష్ణాజిల్లా, నందివాడ మండలం, రుద్రపాక గ్రామ కాపురస్తులు అయిన పిన్నమనేని వెంకటేశ్వరరావు గారి కుమారుడు పిన్నమనేని వీరయ్యచౌదరి గారికి అన్నమయ్య జిల్లా, కలకడ మండలం, నడింపల్లె గ్రామంలో య. 19.79 సెంట్ల భూమి ఉన్నది. దీనికి సంబంధించిన ఒరిజనల్ దస్తావేజు నెం. 1331/2012, పట్టాదారు పాస్‌బుక్ ఖాతా నెం. 1040 పోయినవి. నందివాడ మండలం, రుద్రపాక గ్రామం నుండి గుడివాడకు వచ్చు సందర్భములో కవరు పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. కావున ఎవరికైనా ఈ కవరు దొరికిన ఎడల ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

పిన్నమనేని వీరయ్య చౌదరి
రుద్రపాక, సెల్ : 99480 04959

చురుగ్గా విద్యుత్ లైన్ నిర్మాణ పనులు

మంత్రి జోగి రమేష్ చొరవతో నిధుల మంజూరు



పైడమ్మ కాలనీలో జరుగుతున్న విద్యుత్ లైన్ నిర్మాణ పనులు

పెడన: పట్టణంలోని పాత పైడమ్మ కాలనీలో విద్యుత్ లైన్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. విద్యుత్ సౌకర్యం కల్పించాలని కొన్నేళ్లగా కాలనీ వాసులు విన్నవిస్తున్నారు. ఇటీవల కాలనీ వాసులు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్‌ను కలిసి లిఖితపూర్వకంగా విన్నవించుకోవడంతో మంత్రి స్పందించారు. మున్సిపల్ అధికారులను ఆదేశించడంతో పాటు అంచనాలు రూపొందించాలని సూచించారు. తొలుత రూ.8 లక్షలతో అంచనాలు రూపొందించారు. పనుల ప్రారంభంలో జాప్యం జరగడంతో అంచనా రేట్లు అధికమయ్యాయి. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి రూ.12 లక్షలు పురపాలక సంఘ నిధులు నుంచి వెచ్చించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో విద్యుత్ శాఖాధికారులు మచిలీపట్నం డీఈ ఎం. భాస్కరరావు, ఏడీఈ సీహెచ్ మాణిక్యాలరావు ఆదేశాలతో ఏఈ జయరాం సిబ్బందితో పైడమ్మ పాత కాలనీలో విద్యుత్ లైన్ల పనులు చేపట్టారు. విద్యుత్ స్తంభాలు, తీగలు చేరుకోవడంతో వాటిని నిర్మించే పనులు వేగవంతం చేశారు. కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

యలమర్రు (పెదపారుపూడి): మండలంలోని యలమర్రు శివారు కంద్రికలో రహస్యంగా జరుగుతున్న కోడిపందాల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఇద్దరు జూదారులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2100, కోడి పుంజును సాధ్వీనం చేసుకున్నట్లు ఎస్ఐ పల్లా నాగ కళ్యాణి పేర్కొన్నారు.

యథేచ్ఛగా పేకాట

పెదపారుపూడి: మండలంలోని భూషణగుళ్ళ గ్రామంలోని శివారు డొంకలో గత వారం రోజులుగా రాత్రి సమయంలో పేకాట యథేచ్ఛగా సాగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి జూదారులు పేకాట ఆడేందుకు వస్తున్నారు. పోలీసులు స్పందించి జూదాలపై దాడులు చేసి ఆరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి సాయం

కోడూరు: ఉల్లిపాలెం గ్రామానికి చెందిన చాట్రగడ్డ రంగారావు నివాసగృహం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇటీవల దగ్ధమైంది. వాసవీ కపుల్స్ క్లబ్, కొడాలి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విశ్వంశెట్టి మొగలేశ్వరగుప్తా బాధితుడి కుటుంబానికి రూ.5 వేల విలువ చేసే గృహోపకరణలు, బియ్యం, నిత్యావసర సరుకులు రూ.2 వేల నగదును అందించారు. అవనిగడ్డకు చెందిన భీంజి అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పోలాబత్తిన గోపాలం బాధితుడి కుటుంబానికి రూ.5 వేల నగదును అందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com